క్లుప్తంగా

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం.ఆరీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 998560 6866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సివిల్స్ విజేత తండ్రికి సన్మానం



శివగణేష్‌రెడ్డి తండ్రి మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న అంజద్‌బాషా, తదితరులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లికు చెందిన శివగణేష్‌రెడ్డి సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 119వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శివగణేష్‌రెడ్డి తండ్రి చెన్నంరెడ్డి మల్లికార్జునరెడ్డిని బుధవారం మాజీ డిప్యూటి సీఎం అంజద్‌బాషా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ రఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటకృష్ణ, నాయకులు శీను, బాదుల్లా, దాస్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రాజేష్

కడప వైఎస్ఆర్‌సర్కిల్ : భారతీయ తపాలా శాఖ నిర్వహించిన ధాయ్ ఆకార్ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. కడప నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థిని వినుతకు రూ.5 వేల నగదు, సర్టిఫికెట్‌ను పోస్టల్ సూపరింటెండెంట్ రాజేశ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో చేతితో రాసిన లేఖకు శాశ్వతమైన ఆకర్షణ, వ్యక్తిగత స్పర్శను నొక్కి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, భాస్కర్‌రెడ్డి, రెడ్డిబాషా, మునాఫ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కారమూ నేర్చుకోవాలి



హజరత్ అబూ హసన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : నేటి విద్యార్థులు చదువుకే ప్రాధాన్యం ఇవ్వకుండా సంస్కారాన్ని నేర్చుకోవడం తప్పనిసరి అని పుణేకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక విద్యావేత్త, హజరత్ అబూ హసన్ అన్నారు. కడప బిల్టప్ సర్కిల్‌లోని దారుస్సలాం ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్ అబూ హసన్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు, బంధుమిత్రులు గర్వించేలా సంస్కారవంతంగా ఉండాలని సూచించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సయ్యద్ మొహమ్మద్ దస్తగీర్, ప్రిన్సిపల్ నిసార్ అహ్మద్, షేక్ మహమ్మద్ రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు (చెన్నూరు) : యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖాధికారులు గంగిరెడ్డి, సునీతలు పిలుపునిచ్చారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా ఆధ్వర్యంలో ప్రచురించిన ఉచిత డీఎస్సీ కోచింగ్ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడుతున్న యూటీఎఫ్ బడుగు, బలహీనవర్గాల డీఎస్సీ అభ్యర్థులకు బాసటగా నిలుస్తూ కడపలోని యూటీఎఫ్ భవన్లో ఉచిత కోచింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కె.నరసింహారావు (9440384701), జి.గోపీనాథ్ (9885125056)ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కోచింగ్ అవగాహన సదస్సును ఏప్రిల్ 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు కడప బాలాజీ నగర్‌లోని యూటీఎఫ్ భవన్లో నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వీరనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత భళా.. మార్కులు అదిరేలా



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్

కడప ఎడ్యుకేషన్ : పది ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మెరిశారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి భళా అనిపించారు. కడప నగరంలోని గురుకుల విద్యాపీఠం విద్యార్థులు పది ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. చంద్రకళ 595, హలీమా పాతిమా 590, దీపికారెడ్డి 590, నేహారెడ్డి 588, సుబాన్‌బీ 587, క్యాతిశ్రీ 585, స్వాత్రిక మైత్రేయి 584 వెంకటసాయి 584 మార్కులు సాధించారు. విద్యార్థులను ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, పల్లవి అభినందించారు.

మెరిసిన పవన్ విద్యార్థులు





శ్రవంతి 596 స్నేహలత 594 మాలిక్‌బాషా 588

కడప అక్కాయపల్లె పవన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని ప్రవంతి 596 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారు. స్నేహలత 594, మాలిక్ బాషా 588, మణికంఠ 586, వెంకటయశ్విత 585 పాటు మరో 20 మందికి పైగా 550 మార్కులు సాధించడమే కాకుండా వంద శాతం ఫలితాలను సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

హజరత్ ఆయేషా మోడల్ హైస్కూల్‌లో..

నగరంలోని హజరత్ ఆయేషా మోడల్ హైస్కూల్ ఫర్ గర్ల్స్ విద్యార్థులు పది ఫలితాలో 98 శాతం ఉత్తీర్ణత సాధించి భళా అనిపించారు. సయ్యద్ సలీమా రిఫత్ 586 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ సాధించగా, షేక్ షసేహా తస్లిమ్ 577 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. వి.ఎస్.సఫూర్ ఫాతిమా, షేక్ మిజ్జ 576 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు.



సలీమా రిఫత్ (586)

గాంధీనగర్ హైస్కూల్ విద్యార్థుల సత్తా



విద్యార్థులతో హెచ్ఎం అఫ్రిపున్

పది ఫలితాల్లో కడప మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని గాంధీ నగర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. సాహిత 581, లోహిత 561, వైష్ణవి 561, శ్రీలత 554 మార్కులు సాధించి పాఠశాల టాపర్స్‌గా నిలిచారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ అఫ్రిపున్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

పదిలో మెరిసిన నాగార్జున విద్యార్థులు





వెంకటశివమోక్షిత్(594) అఫ్రీన్(593) వెంకటహాసిని(592)

కడప ఎడ్యుకేషన్ : పది ఫలితాల్లో నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థులు వెంకట శివ మోక్షిత్ 594, ఆఫ్రీన్ 593, వెంకట హాసిని 592, హాసిని నవ్య 592, సుదర్శన్ 592, హస్మిత 591, షగుస్తా ఈరం 591, హన్సిని 590 మార్కులు సాధించారు. 61 మంది 580 మార్కులు, 160 మంది 560, 248 మంది 540, 316 మంది 500 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి, బానేష్ సాయిరెడ్డి అభినందించారు.

సత్తా చాటిన సాయిబాబా హైస్కూల్



కేక్‌ను తినిపిస్తున్న వైస్ చైర్మెన్ సాయి సుధీర్‌రెడ్డి

కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో భళా అనిపించారు. కమ్మర ధనుంజయ ఆచారి 595 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారు. మద్దిరాల గుణరుషిత, షేక్ పర్హానా 586, బైలడుగు నిఖిత 585 మార్కులు సాధించారు. 29 మంది 550, 80 మంది 500 మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మెన్ యంవీ.రామచంద్రారెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి, వైస్ చైర్మెన్ సాయిసుధీర్‌రెడ్డి అభినందించారు.

బాల వికాస్ విద్యార్థుల సత్తా





గౌషియా 594 మీణ సహన 593 రిహాన 592

పది ఫలితాల్లో కడప ఎర్రముక్కపల్లె బాలవికాస్ ఇంగ్లీష మీడియం విద్యార్థులు గౌషియా 594 మార్కులు సాధించారు. మీణ సహన 593, రిహాన ప్రాష్ణ, ప్రదీప్‌కుమార్, సుదీప్తి, లాస్య 592, మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ సుబ్బారాయుడు, డైరెక్టర్ గంగయ్యలు అభినందించారు.

శివ శివానీ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం ఎర్రముక్కపల్లిలోని శివ శివానీ పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో ప్రతిభ చాటి అత్యధిక మార్కులు సాధించారు. జీవన్ విష్ణు 592, విష్ణు వర్ధన్ 590, ప్రణీత్ రెడ్డి 583, సత్విక రోషన్ 580 మార్కులు సాధించారు. కరస్పాండెంట్ రమణి, డైరెక్టర్ నాగేంద్ర రెడ్డి అభినందించారు.

పదిలో సిద్దార్థ స్కూల్ విజయకేతనం



ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ లక్షుమయ్య

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి ఫలితాల్లో కడప నగరం మోచంపేట సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు మహమ్మద్ మజారుద్దీన్ 582, సుమయ్యబేగం 575 మార్కులు సాధించారు. పాఠశాల డైరెక్టర్ లక్షుమయ్య అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థులు భళా



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఏజీ ఎం రమణయ్య

కడప ఎడ్యుకేషన్ : కడప జోన్ శ్రీచైతన్య విద్యార్థులు 2504 మంది పరీక్షకు హాజరుకాగా 98.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఏజీఎం దేరంగుల రమణయ్య తెలిపారు. సాయి హర్షిణి 597, హర్షణ కార్తికేయ, దయానందరెడ్డి, గ్రాయత్రీదేవీ, వసీమ్, హుస్సేన్‌లు 596 మార్కులు, యాఫీయా, యశస్విని595 మార్కులు సాధించారు. 13 మంది 595, 102 మంది 590, 217 మంది 585 మిగిలిన వారు 500 కుపైన మార్కులు సాధించారు. పాఠశాల ఏజీఎం దేరంగుల రమణయ్య, ప్రిన్సిపాల్స్, డీన్స, కో ఆర్డినేటర్స్ అభినందించారు.

ఒలంపియాడ్ విద్యార్థుల ప్రభంజనం

కడప ఎడ్యుకేషన్ : పది ఫలితాలలో కడప ఎన్జీవో కాలనీలోని నారాయణ ఒలంపియాడ్- సిఓ పాఠశాల విద్యార్థులు సుచరిత 596, షేక్ మహమ్మద్ ఇర్ఫాన్ 595, నిహారిక 594, జయమధుమిత 593, త్రిపద 592, భవ్య శ్రీ 591, మార్కులు సాధించారు. మొత్తం 590కుపైగా 28 మంది, 580కి పైగా 121 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. వారిని ఏజీఎం శ్రీనివాసులు, కళాశాల డీన్ చంద్ర కిషోర్ రెడ్డి, ప్రిన్సిపల్ షరీఫ్, కోఆర్డినేటర్ సంపత్, ఏఓ భార్గవ్ రెడ్డి అభినందించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఏజీఎం, డీన్ తదితరులు

కనక మహాలక్ష్మి స్కూల్స్..



ప్రియ మేఘనను అభినందిస్తున్న పాఠశాల చైర్మెన్ శివతులశమ్మ

కనకమహాలక్ష్మి విద్యా మందిర్ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత కనబరిచి ప్రతిభ చాటారు. సభాహత్ తస్కీన్కు 537 మార్కులు వచ్చాయి.

నాగార్జున హైస్కూల్‌లో..

కడప మారుతీనగర్ నాగార్జున హైస్కూల్ విద్యార్థిని నాగనవ్య 594 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. చర్మిష్మా 587, నిత్యశ్రీ 582, ప్రియమేఘన 580 మార్కులు సాధించారు. వారిని కరస్పాండెంట్ శివతులశమ్మ, డైరెక్టర్ శివప్రసాద్ రెడ్డి, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

పోప్ ఆత్మశాంతికై బిషప్ ప్రార్థనలు

కడప కల్చరల్ : కథోలిక క్రైస్తవ ప్రపంచ గురువు పోప్ ఫ్రాన్సిస్ ఆత్మశాంతి కోసం కడప కథోలిక పీఠాధిపతి రైట్ రెవరెండ్ బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మరియాపురంలోని క్యాథడ్రల్ చర్చిలో ఇతర గురువులతో కలిసి పోప్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఇతర గురువులు, దైవజనులతో కలిసి ఈ సందర్భంగా దివ్యబలిపూజ సమర్పించారు. ఈ కార్యక్రమంలో మేత్రాసన గురువులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సాహిత్యం విరివిగా రావాలి

కడప కల్చరల్ : క్రైస్తవుల ప్రార్థనాలయాలు, సంప్రదాయాలు, ఆహార వ్యవహారాల పట్ల అందరికీ అవగాహన కలిగించే దిశగా క్రైస్తవ సాహిత్యం విరివిగా రావాల్సిన అవసరం ఉందని కడప కథోలిక పీఠాధిపతి డాక్టర్ పాల్ ప్రకాష్ అన్నారు. స్థానిక బిషప్స్ హౌస్‌లో జ్యోతి జార్జి రచించిన జ్యోతిర్మయుడు పుస్తకాన్ని బిషప్ పాల్ ప్రకాష్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికి చరిత్ర, సాంస్కృతిక సాహిత్యంతో పాటు క్రైస్తవ సాహిత్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ తలారి బాలరాజు, ఫాదర్ ఎండీ ప్రసాదరావు, ఫాదర్ లూర్ధురాజు, జయపాల్, కె.యాగప్ప, ఇలియాస్ రెడ్డి, విక్టర్ పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న బిషప్ సగినాల పాల్ ప్రకాశ్

పహల్గామ్ ఉగ్రదాడి దారుణం



మృతులకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఖాదర్ బాషా, తదితరులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఉగ్రదాడి దారుణం అని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో పహల్గామ్‌లో మరణించిన వారికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్ర దాడిలో పౌరుల మరణానికి కేంద్ర ప్రభుత్వం తీరే కారణమన్నారు. కొండలు, అడవులు, సరిహద్దుల్లో టెర్రరిస్టులు, చైనా, పాక్‌లతో పోరాటం చేయాలంటే జవాన్లు అవసరం ఉందన్నారు. తక్షణమే ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్‌గౌడ్, అశోక్‌రెడ్డి, పి.శివారెడ్డి, పీడీ.సంజయ్‌కాంత, ముబారక్ బాషా పాల్గొన్నారు.

మోదీ క్షమాపణ చెప్పాలి

పర్యాటకులకు భద్రత కల్పించడంలో విఫలమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాశ్మీరు లోయలోని పహల్గామ్ ప్రాంతాన్ని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకోవడం బాధాకరమన్నారు. ఉగ్రదాడిలో 30 మంది ప్రాణాలు కోల్పోవడమేగాక, చాలామంది క్షతగాత్రులుగా మిగిలారన్నారు. ఎన్డీఏకు ప్రభుత్వానికి చంద్రబాబునాయుడు కూడా బాధ్యుడవుతారన్నారు. ముస్లిం మైనార్టీలను అణగదొక్కాలనే ఆలోచన మినహా, సమస్యలు పరిష్కరించడంలో చేతగాని సర్కారుగా మోది ప్రభుత్వం మారిందన్నారు.

ఉగ్రవాదుల చర్య అమానుషం

కడప రూరల్ : జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల చర్య అమానుషమని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక గౌస్‌నగర్‌లో బుధవారం మతసామరస్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడిలో అమాయకులైన టూరిస్టులు మరణించారని, కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అమానుల్లా, సయ్యద్ సమీ, మహబూబ్ బాషా, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలి

కడప కల్చరల్ : కశ్మీర్ ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సట్టి భారవి అన్నారు. కశ్మీర్‌లోని పెహల్గావ్ ప్రాంతంలోజ రిగిన ఉగ్రదాడిని ఆయనఖండించారు. పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా చిత్రహింసలు పెట్టి చంపడం మానవతకే మాయని మచ్చ అన్నారు.పాకిస్తాన్ బార్డర్‌లోకి చొచ్చుకు వెళ్లి ఇలాంటి తీవ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అంతా మా ఇష్టం

- ఆర్టీసీ డిపో మేనేజర్ పదోన్నతుల్లో అవకతవకలు
- పాటించని రోస్టర్ పాయింట్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీలో డిపో మేనేజర్ పదోన్నతుల్లో అవకతవకలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా డిపో మేనేజర్ పోస్టుల భర్తీలో ఆపరేషన్స్, మెకానికల్, పర్సనల్, అకౌంట్స్ స్టోర్స్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలు 50 రోస్టర్ సైకిల్ ప్రకారం 23:19:2:2:2:2 ప్రాతిపదికన ఇవ్వడం జరుగుతుంది. అయితే ప్రమోషన్ల నిష్పత్తిలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్, ఏతలకు 50 డిపో మేనేజర్ పోస్టులకు 2 చొప్పున మొత్తం 126 డిపో మేనేజర్ పోస్టులకు ఐదుగురు వస్తారు. అయితే ఇప్పటికే ఆరుగురు డిపో మేనేజర్ స్థాయి అధికారులుగా పనిచేస్తున్నారు. వారికి రావాల్సిన కోటా వారు ఇప్పటికే పదోన్నతులలో తీసుకుని ఉన్నారు. అలాగే అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్‌లకు, అసిస్టెంట్ మేనేజర్ మెకానిక్‌లకు రావాల్సిన పదోన్నతులను సివిల్ ఇంజనీరింగ్ వారికి ఇవ్వడంతో వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పలువురు వాపోతున్నారు. పర్సనల్ డిపార్టుమెంటు వారికి హెడ్ ఆఫీసులో కొంతమంది అధికారులు ఇప్పటికే సీపీఎం, డిప్యూటీ సీపీఎం పోస్టులలో పనిచేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓలను, ఆర్టీసీ నిబంధనలను ఖాతరు చేయకుండా తమ ఇష్టానుసారంగా పదోన్నతులను ప్రతిపాదించడం, ఆమోదింపజేయించుకోవడం చేస్తున్నారు. ఈనెల 21వ తేదిన తెలియజేసిన ఇద్దరు సివిల్ ఇంజినీరింగ్ వారికి పదోన్నతులు తీసుకున్నారు. ఒక్క ఇంజినీరింగ్ విభాగానికే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వడం, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)లకు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానిక్)లకు ప్రమోషన్లలో తీవ్రంగా నష్టం జరుగుతోందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హోంగార్డ్ ఇంట్లో చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పకీరు పల్లెలో నివాసముంటున్న హోంగార్డ్ హరినాథ్‌రెడ్డి ఇంటిలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. హోంగార్డ్ బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి తన భార్యతో పాటు బయటికి వెళ్లారు. 12 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చాడు. తాళం తీసినట్లు, ఇంటిలో బీరువా పగలగొట్టి 9 తులాల బంగారు ఆభరణాలు తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజరాజేశ్వరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారి సత్యా గ్రీన్ సిటీ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కడప వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం, వల్లూరు వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ఆంగ్ల భాషలో ప్రావీణ్యంతో అవకాశాలు విస్తృతం

కడప ఎడ్యుకేషన్ : ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించే వారికి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని యోగి వేమన విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య పి.పద్మ అన్నారు. షేక్స్‌పియర్ జయంతి సందర్భంగా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ బ్లాక్ సెమినార్ హాల్‌లో గురువారం ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించింది. ప్రజలు ఆంగ్ల భాషలో కమ్యూనికేట్ చేయడం ద్వారా ప్రపంచంలోనిలోని ఇతర దేశాల వారితో ఆలోచనలు పంచుకోవచ్చన్నారు. ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ డీన్ ఆచార్య కె.గంగయ్య మాట్లాడుతూ భారతదేశంలో ఆంగ్ల భాష ప్రవేశం నుంచి పరిణామ క్రమాన్ని వివరించారు. ఆంగ్ల శాఖ విభాగాధిపతి డాక్టర్ అంకన్న, సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర సంచాలకులు ఆచార్య పార్వతి, డాక్టర్ ప్రమీల మార్గరెట్, జి.మెర్సీ విజేత, రమాదేవి, ఎంఎం.వినోదిని, పి.చిట్టిబాబు, డా.వై హరిబాబు, వివిధ శాఖల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ

ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించాలి

వీరపునాయునిపల్లె : మండలంలోని ప్రతి రైతు సోదరుడు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా భాగస్వామ్యం, ప్రకృతి–వ్యవసాయ అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. పీఎం డీఎస్–నవదాన్యాల సాగుతో 365 పంటలు సాగు చేయాలని ఆయన రైతులకు సూసించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, మహిళా రైతులు, వెలుగు కార్యాలయ సిబ్బంది, గ్రామ సమాఖ్య ప్రతినిదులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న నరసింహారెడ్డి

కేంద్ర కారాగారం పరిశీలన



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ జిల్లా న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి ఎస్.బాబా ఫక్రుద్దీన్‌లు తమ సిబ్బందితో కలిసి రెండో రోజున బుధవారం కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ హైకోర్టు దోషిగా నిర్ధారించినప్పటికీ, ఖైదీ ఇంకా భారత సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయని విషయం గుర్తు చేశారు. శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు అర్హత ఉన్న ఖైదీలను గుర్తించడం జరుగుతోందన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 వివరించారు.అనంతరము పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చంద్రకాంతమ్మ, ప్రవీణ్ కుమార్, సౌజన్య, అక్బర్ అలీ, రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన తిరునాల

కమలాపురం : మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ ఎల్లమ్మ(హేలాంబ) తిరునాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. బుధవారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర ఆధ్వర్యంలో, ధర్మ కర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో తిరునాల మహోత్సవాలు ప్రారంభం అయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో బాజా భజంత్రీల నడుమ, భక్తుల సమక్షంలో ఎల్లమ్మను ప్రతిష్ఠించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ప్రముఖ రంగ స్థల నటుడు, నందీ అవార్డు గ్రహీత ఎల్, సుబ్బరాయుడు తన బృందంతో కలసి చెప్పిన ఎల్లమ్మ కథ భక్తులను ఆకట్టుకుంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పెద్దచెప్పలి తదితర గ్రామాలలో ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జిల్లాలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు జరిగాయన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చాలా మంది బయట నిద్రిస్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్ర పరచుకోవాలని సూచించారు. పొలం పనులకు, వాకింగ్‌కు, పశువులు మేపు కోవడానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమలాపురం ఎస్ఐ 91211 00532, సీఐ 91211 00529 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.